ఈనాడు
epaper.eenadu.net

# ప్రభుత్వ పరిశీలనలో మెట్రో డీపీఆర్‌లు

**రెండో దశ(బి) అంచనా వ్యయం రూ.19,579 కోట్లు**

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఇతర రాష్ట్రాల్లో మెట్రోరైలు నిర్మాణ అంచనాలు, హైదరాబాద్‌లో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెట్రో రెండో దశ(బి) డీపీఆర్‌లను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి గురువారం వెల్లడించారు. ఈ నెల 8న హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు డీపీఆర్‌లను ఆమోదించిన అనంతరం ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. రాష్ట్రం ఆమోదించి, కేంద్రానికి సమర్పించాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో జేబీఎస్‌ను అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు పలు అంశాలను పొందుపర్చామని తెలిపారు.

**డీపీఆర్ విశేషాలు ఆయన మాటల్లోనే..** ● రూ. 19,579 కోట్ల అంచనాతో 86.1కి.మీ. మెట్రో ఫేజ్2(బి) కారిడార్లు ప్రతిపాదించి డీపీఆర్‌లు పూర్తిచేశాము.

● జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ప్రతిపాదిత కారిడార్లు ఉన్నాయి.

● జేబీఎస్-మేడ్చల్ మార్గం 24.5కి.మీ., 18 స్టేషన్లతో పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌గా ఉంటుంది. ● జేబీఎస్-శామీర్‌పేట మార్గం 22కి.మీ. దూరంలో 14 స్టేషన్లను ప్రతిపాదించాము. ఇందులో 20.35కి.మీ. ఎలివేటెడ్‌గాను, 1.65కి.మీ. భూగర్భ మార్గంగా ఉంటుంది. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సమీపంలో భూగర్భ మార్గం ఉంటుంది.

● శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్స్ యూనివర్సిటీ వరకు 39.6కి.మీ. ప్రతిపాదించాం. విమానాశ్రయం నుంచి 1.5కి.మీ. భూగర్భ మార్గం, 21కి.మీ. ఎలివేటెడ్, 17కి.మీ. భూమార్గం (ఎట్ గ్రేడ్)గాను ఉంటుంది. విమానాశ్రయం నుంచి పెద్ద గోల్కొండ, రావిర్యాల్ మీదుగా స్కిల్స్ యూనివర్సిటీ వరకు ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

Date : 23/05/2025 EditionName : GREATER HYDERABAD PageNo :